
# ప్రోత్సాహకం కనుమరుగు

- షేర్స్‌పై వచ్చే డివిడెండ్ ఫండ్ పక్కదారి
- రైతులకు రావాల్సిన రూ.26 లక్షల రివార్డు మాయం
- గండీడ్ పీఏసీసీఎస్‌లో మరో అక్రమం వెలుగులోకి..





గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

గండీడ్/మహ్మదాబాద్ ఆగస్టు 25 : సహకార సంఘంలో డివిడెండ్ ఫండ్ అని ఒకటి ఉంటుందని రైతులకు తెల్వదు. ఇటు పాలకవర్గ సభ్యులకు తెల్వదు, తెలిసినా ఇవ్వరు. ఈ ఫండ్ గురించి ఎవరికీ తెలవకపోవడమే సహకార సిబ్బందికి వరంగా మారింది. డివిడెండ్ ఫండ్ గోల్‌మాల్ చేయడానికి వారికి మంచి అవకాశం దొరికింది. అసలు డివిడెండ్ ఫండ్ అంటే ఏమిటీ అసలు విషయం తెలుసుకుందాం. రైతులు తీసుకున్నప్పు రుణం మొత్తంపై 10 శాతం షేర్స్ (వాటా)రూపంలో సొసైటీ ఖాతాలో ఆ రైతు పేరిట జమచేస్తారు. దీనిపై వచ్చిన లాభాలను షేర్స్ పెట్టిన రైతులకు కొంత మొత్తం తిరిగి రైతుల ఖాతాలో జమచేసే ఫండ్‌నే డివిడెండ్ ఫండ్ (ప్రోత్సాహక నగదు) అంటారు. ఏ సంస్థ అయిన వచ్చిన లాభాలను వాటాదారులకు పంచే విధానం. గతంలో మండలంలో 6 సహకార సంఘాలు ఉండేవి. రుసుంపల్లి, గండీడ్, వెన్నాచేడ్, మోకర్లబాద్, నంచర్ల, మహ్మదాబాద్ గ్రామాల్లో ఉండేవి. 2005 సంవత్సరంలో ప్రభుత్వం ఆరింటిని కలిపి మండలానికి ఒక్కటిగా గండీడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసింది. సహకార సంఘాలు విలీనం కాకా ముందుకే వాటా ధనం దాదాపు రూ.2.50 కోట్లపైగానే ఉన్నట్లు సమాచారం. ఆనాటి నుంచి వాటాధనంపై వచ్చిన ప్రోత్సాహక నగదు మాత్రం ఏ ఒక్కరికీ చెల్లించలేదు. ఈ రివార్డును సంఘానికి ప్రభుత్వం అందిస్తుంది. దీ నిని ఏడాదికి ఒక్కసారి సంఘం రైతులకు రివార్డులను అందించాలి. ఈ రివార్డు చూడడానికి చిన్నగానే ఉన్నా రూ.లక్షల్లో ఉంటుంది. ఒక్కో రైతుకు వచ్చేది రూ.వంద, రూ.రెండోందలే అయినప్పటికీ రైతులకు ఇవ్వకుండా సిబ్బంది వాడేసుకున్నారు. ఈ రివార్డు ఫండ్ దాదాపు 2005 నుంచి నేటి వరకు దాదాపు రూ.26 లక్షల పైమాటే. రుణాలు ఇస్తున్న కొద్దీ ఈ షేర్స్ పెరుగుతుంటాయి. మనకు తెలిసిన వివరాల ప్రకారం సుమారు రూ.26 లక్షలకు పైగానే ఉంటుంది. పూర్తి వివరాల కోసం కార్యాలయానికి వెళ్లిన సిబ్బంది తమ దగ్గర లేదంటూ ఒకరిపై ఒకరు చెప్పి ఇస్తాం అంటూ పూర్తి సమాచారం ఇవ్వడం లేదు. షేర్స్‌ను మాత్రం గుటకాయ స్వాహా చేయకుండా వదిలి పెట్టారు. రైతు షేర్సు కూడా తీయడానికి వచ్చి ఉంటే ఈ పాటికే ఆ నిధులను కూడా మింగేసేవారు. ఈ ఫండ్‌ను రైతులకు నగదు రూపంలో లేదా ఖాతాలో గానీ జమచేయాలి. కానీ ఇప్పటి వరకు ఏ విధంగానూ రైతులకు ముట్టలేదు. ఇది రైతులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

గండీడ్ పీఏసీసీఎస్ సీఈవో ఆశన్నను వివరణ కోరగా.. కొన్నేండ్ల నుంచి షేర్స్‌పై ప్రోత్సాహక నగదు సొసైటీకి వచ్చేదని, ప్రస్తుతం బ్యాంకు వారే రైతుల ఖాతాల్లో డిపాజిట్ చేస్తున్నారన్నారు. పూర్తి సమాచారం అయితే తన వద్ద లేదని చెప్పారు.

# 51 మంది దూరం!

- తప్పుల తడకగా డేటా ఎంట్రీ
- లిస్టులో పేరు రాకపోవడంతో రైతుల ఆవేదన
- రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికమా..?
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న పీఏసీసీఎస్ అధికారుల నిర్లక్ష్యం



మాగనూర్ వ్యవసాయ సహకార సంఘం

మాగనూర్, ఆగస్టు 25 : మాగనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అధికారుల నిర్లక్ష్యంతో 51 మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. రుణ వివరాలను సొసైటీ సిబ్బంది నమోదు చేయడంలో అలసత్వం వహించారు. దీంతో అన్ని అర్హతలున్నా అధికారుల నిర్లక్ష్యమే తమను నిండా ముంచిదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సిబ్బంది తప్పుల తడకగా డేటాను ఎంట్రీ చేయడమే కాకుండా 51 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. రెండేండ్ల కిందట తీసుకున్న రుణాల వివరాలను ఎందుకు ఎంట్రీ చేయలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం సహకార సంఘంలో 1,438 మంది రైతులు రూ.పదివేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకోగా.. కేవలం 559 మందికి మాత్రమే రుణమాఫీ పథకం వర్తించింది. ఇంకా 879 మందికి మాఫీ కాలేదు. కానీ అధికారులు మాత్రం రేషన్ కార్డులో ఒకరు ఉన్నారు. ఇద్దరు ఉన్నారని ఇలా అనేక కారణాలు చెబుతుండడంతో రైతులు పీఏసీసీఎస్ అధికారులు, వ్యవసాయాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెప్పినా.. అధికారులు మాత్రం రేషన్ కార్డును ఏ ప్రామాణికంగా తీసుకున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. అదే పీఏసీసీఎస్‌లో ఎన్.నాగేంద్ర రూ.15 వేల రుణం తీసుకోగా తప్పుడు లెక్కలు చేసి రూ.1,01,438 రుణం ఉన్నట్లు సృష్టించారు. వివరాల నమోదులో ఎన్.నాగేంద్ర బదులు ఎం.నాగేంద్ర అని ఎంట్రీ చేయడంతో మాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సిబ్బంది, అధికారులను అడిగితే.. మేము తప్పుగా ఎంట్రీ చేయలేదంటూ ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టుకుంటున్నారు. అంతేకాకుండా సిబ్బంది రుణమాఫీ అయిన రైతుల నుంచి రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సహకార సంఘం సీఈవో గోవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. 51 మంది వివరాలు డేటా ఎంట్రీ చేయకపోవడంతో రూ.2 లక్షల రుణమాఫీకి దూరం అవుతున్నారన్నారు. వివరాలు ఎందుకు నమోదు చేయలేదని అడగగా.. అమెరికా టూర్ వెళ్లిన సందర్భంలో ఇలా జరిగి ఉంటుందని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.



## రుణమాఫీలో నా పేరు లేదు..

మాగనూరు పీఏసీసీఎస్‌లో 2023 అక్టోబర్ 16వ తేదీన రూ.లక్ష లోన్ తీసుకున్నాను. అయితే, ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించిన నేపథ్యంలో నా రుణం మాఫీ అవుతుందని భావించాను. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీ జాబితాలో నా పేరే లేదు. రుణమాఫీ అవుతుందా? లేదా? అని అధికారులను అడిగితే బ్యాంకర్లపై.. వారిని అడిగితే అధికారులపై నెట్టుకుంటున్నారు. ఇక మాఫీ అవుతుందన్న నమ్మకం పోయింది.

- పార్వతమ్మ, రైతు, మాగనూరు



## అధికారుల నిర్లక్ష్యం వల్లే..

మాగనూరు పీఏసీసీఎస్‌లో 2023 అక్టోబర్ 4న రూ.80వేల రుణం తీసుకున్నాను. లిస్టులో నా పేరే లేదు. అధికారుల తప్పిదం వల్లే రుణమాఫీ కాలేదు. వారు డేటా ఎంట్రీ తప్పులు చేయడంతోపాటు కొంత మంది పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్లే మేం నష్టపోయాం. ఇప్పటికైనా సిబ్బంది తప్పులను సరిచేసి అర్హులకు రుణమాఫీ అయ్యేందుకు సహకరించాలి.

- అంజప్ప, రైతు, ఓబులాపూర్

# రుణపాశం!

- అన్నదాతలను వెంటాడుతున్న అప్పుల బాధలు
- అటు రుణమాఫీ కాక.. ఇటు రైతు భరోసా లేక అవస్థలు
- నిబంధనల పేరిట లిస్టుల్లో పేర్లు గయాబ్
- బ్యాంకులు, అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు
- సర్కారు చెప్పిందొకటి.. చేసిందొకటి అంటూ విమర్శలు

గద్వాల, ఆగస్టు 25 : జిల్లాలోని రైతులకు రుణమాఫీ బాధలు తప్పడం లేదు. జిల్లాలోని రైతులకు అటు రుణమాఫీ కాకపోవడంతోపాటు ప్రభుత్వం వానకాలం పంటలు సాగుకు అందజేసే పెట్టుబడి సాయం అందక రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. సీఎం రేవంత్ తీరు అధికారంలోకి రాక ముందు ఒకలా వచ్చిన తర్వాత మరొకలా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయడంతోపాటు ఆగస్టు నాటికి వానకాలం సాగుకు రైతుబంధు నిధులు రైతుల ఖాతాలో జమ చేయడంతో సాగు పనులు చకాచకా కొనసాగేవి. ప్రస్తుత ప్రభుత్వం రుణమాఫీ అరకొర చేయడంతోపాటు రైతు భరోసాపై ఇప్పటి వరకు క్లారిటీ ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం దళారుల వద్ద చేయి చాపాల్సిన పరిస్థితి నెలకొన్నది. రుణమాఫీ రైతుల పాలిట యమపాశంగా మారింది. జిల్లాలో మూడు విడుతల్లో 95,199 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా ప్రస్తుతం 51,188 మంది రైతులకు రూ.440 కోట్లు మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసింది. ఇంకా 44,011 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉన్నది. అయితే బ్యాంకు అధికారుల పొరపాట్లతో కొంతమంది అర్హులు కూడా రుణమాఫీ పొందలేక పోయారు. రైతులు రూ.రెండులక్షల లోపు రుణాలు తీసుకొని వడ్డీకట్టి రెన్యువల్ చేసుకున్నారు. అయితే బ్యాంక్ అధికారులు కట్టిన వడ్డీని రుణమాఫీలో చూయించకపోవడంతో ప్రస్తుతం ఆ రైతులకు రుణమాఫీ కావడం లేదు. అధికారులు చేసిన పొరపాట్లకు తమకు మాఫీ కాకుండా పోయిందని అన్నదాతలు ఆవేదన చెందుతూ బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హులుగా ఉండి రుణమాఫీ కాని రైతులు జిల్లాలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

### స్పష్టత ఇవ్వడం లేదు..



జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో నాపేరు మీద రూ.లక్షా50వేలు, నా భార్య మాణిక్యమ్మ పేరు మీద రూ.లక్షా30వేల రుణం తీసుకున్నాము. ప్రభుత్వం విడుదల చేసిన రూ.2లక్షల రుణమాఫీ మూడో విడుత జాబితాలో మా పేర్లు రాలేదు. రూ.2లక్షలకు పైగా ఉన్న రూ.80వేలు బ్యాంక్‌లో జమచేస్తాను రుణ మాఫీ వర్తించేలా చూడాలని బ్యాంక్ అధికారులను కోరినా సరైనా సమాధానం చెప్పడం లేదు. ముందు డబ్బులు జమ చేయండి రుణమాఫీ అయినప్పుడు అవుతుందనే సమాధానం చెబుతున్నారు.

- కుమ్మరి గోవింద్, రైతు, లత్తీపురం, గద్వాల మండలం

## నిబంధనల సాకుతో మోసం..



గద్వాల యూనియన్ బ్యాంక్‌లో నా పేరు మీద రూ.85వేలు, నా భార్య మణెమ్మ పేరు మీద రూ.1.25 లక్షల రుణం తీసుకున్నాం. రూ.2 లక్షల పైన ఉన్న డబ్బులు చెల్లిస్తేనే మాఫీ అవుతుందని బ్యాంకోళ్లు చెబుతున్నారు. కాంగ్రెసోళ్లు ఎన్నికల సమయంలో ఇవేవీ చెప్పలేదు. నిబంధనల సాకుతో రైతులను మోసం చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. మొదట రూ.2 లక్షల మాఫీ చేయాలి. లేకుంటే మాఫీ కాని వారందరం ఆందోళనకు దిగుతాం.

- గడ్డంరాములు, రైతు, బీరెల్లి, గద్వాల మండలం

## రేషన్‌కార్డు లేదని మాఫీ చేయలే..



నేను ధన్వాడ యూనియన్ బ్యాంక్‌లో పంట రుణం రూ.1,53,000 తీసుకున్నా. రెగ్యులర్‌గా రెన్యూవల్ చేస్తూ వచ్చాను. అయినా నాకు మాఫీ కాలేదు. ఈ విషయమై బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేనందుకు మాఫీ కాలేదని చావు కబురు చల్లగా చెబుతున్నరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ కొర్రీలు పెట్టి రైతుల కడుపు కొట్టడం బాధాకరం.

- నారాయణరెడ్డి, గోటూర్, ధన్వాడ మండలం, నారాయణపేట జిల్లా

# కొలిక్కొచ్చేనా?

- ఇంకా వీడని శ్రీధర్‌రెడ్డి హత్యకేసు
- మూడ్నెళ్లుగా సా..గుతున్న విచారణ
- దొరకని నిందితుల ఆచూకీ..
- పోలీస్ ఉన్నతాధికారులకు బాధిత కుటుంబీకుల విజ్ఞప్తి
- న్యాయం చేయాలని డిమాండ్





హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డి (ఫైల్)



గ్రామస్తులను విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

వనపర్తి, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి మూడు నెలలు అవుతున్నది. అయినా, ఇప్పటివరకు హంతకుల జాడ లేకపోవడంతో అందరి దృష్టి పోలీసులపై పడింది. రాష్ట్రస్థాయిలో రాజకీయ హత్యగా చర్చకు దారితీసిన ఈ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. కేసు కొలిక్కి రానందునా హంతకులను ఎప్పుడు పట్టుకుంటారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. లక్ష్మీపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి మే 22వ తేదీన అర్ధరాత్రి ఇంటిపక్కన కల్లంలో నిద్రిస్తుండగా హత్యకు గురైన సంగతి విధితమే. హత్య జరిగి 90రోజులు గడుస్తున్నప్పటికీ విచారణలో ఎలాంటి పురోగతి లేదు. ముందుగా వనపర్తి సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో కొంతకాలం విచారణ కొనసాగింది. హంతకులను పట్టుకోవాలని ఒత్తిడి ఉన్నప్పటికీ కేసులో పోలీసులకు ఆశించిన పట్టు దొరకలేదు. కుటుంబ సభ్యులు ఇది రాజకీయ హత్య ముక్తకంఠంగా పోలీసులకు చెబుతూ వచ్చారు. రాష్ట్రస్థాయిలో ఈ ఘటన అప్పట్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఇప్పటి వరకు ఈ ఘటనలో దాదాపు 50మంది వరకు పోలీసులు విచారణ చేసినట్లు అనధికార సమాచారం. స్నేహితులు, రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీలు, ఆర్థికపరమైన సంబంధాలు, రాజకీయ ప్రత్యర్థులు, ఇతర అనుమానిత వ్యక్తులతో ఉన్న సంబంధాలపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులు పకడ్బందీగా వ్యవరించడంతో పోలీసులకు దర్యాప్తులో ముచ్చెమటలు పడుతున్నాయి.

### ఐజీ వచ్చి వెళ్లినా..

శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనలో నిందితులను పట్టుకోవడంలో ఆలస్యమైందన్న ఒత్తిడితో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ జూలై 17న లక్ష్మీపల్లి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబంతో మాట్లాడారు. విచారణ వేగవంతానికి ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐల సమక్షంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌లో ఐజీ వెల్లడించారు. ఐజీ వచ్చి వెళ్లి 35 రోజులు గడుస్తున్నా, ప్రత్యేక బృందం పలు కోణాల్లో విచారణ చేపట్టినా నిందితుల జాడ మాత్రం తెలియరాలేదు. ఇదిలా ఉండగా, ఇటీవల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి లక్ష్మీపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో ఇంకా ఆలస్యమైతే రాష్ట్ర పోలీసు అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ప్రకటించారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు.

## అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం..



శ్రీధర్‌రెడ్డి హత్య కేసును త్వరలోనే ఛేదిస్తాం. ఐజీ సత్యనారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నాం. ఎక్కడా శాఖాపరమైన నిర్లక్ష్యం లేదు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. హంతకులను పట్టుకుంటాం. కొత్త, పాత అనుమానితులందరినీ విచారణ చేస్తున్నాం. వీలైనంత త్వరగా కేసులో పురోగతి సాధిస్తాం.

- రావుల గిరిధర్, ఎస్పీ, వనపర్తి జిల్లా

## డబ్బుల కోసం..

- కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

మహ్మదాబాద్, ఆగస్టు 25 : కన్న కొడుకే కాలయముడిగా మారి డబ్బుల కోసం తల్లి అని చూడకుండా దారుణంగా హతమార్చిన ఘటన గండీడ్ మండలంలోని సల్కర్‌పేట్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఏఎస్సై ఆజం అలీ తెలిపిన కథనం మేరకు సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన ఈడ్గి వెంకటమ్మ(50) కొడుకు కృష్ణయ్యతో కలిసి నివాసం ఉండేది. తమకు ఉన్న ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుల విషయంలో శనివారం రాత్రి తల్లి కొడుకులకు మధ్య గొడవ జరిగింది. కొడుకు కృష్ణయ్య ఇనుపరాడ్డుతో తల్లి వెంకటమ్మ తలపై బలంగా కొట్టి గొంతును కోసి చంపేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లి పక్కనే ఉన్న వెంకట్‌రెడ్డికి చెందిన ప్లాట్‌లో పడేశాడు. ఉదయం లేచి మా అమ్మ కింద పడి దెబ్బలు తగిలాయని ఏడ్చుకుంటూ గ్రామస్తులకు తెలుపగా చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా ఆమె హత్యకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీ నాయక్ చేరుకొని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. మృతురాలి తమ్ముడు రాములుగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకటమ్మ మృతదేహం

## పెండ్లి కాకుండానే గర్భం

- వ్యక్తిపై కేసు నమోదు

ఊట్కూర్, ఆగస్టు 25 : పెండ్లి కాకుండానే యువతి గర్భం దాల్చిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై కృష్ణంరాజు కథనం మేరకు.. మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌కు పెండ్లి కాగా.. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన యువతికి (25) మాయ మాటలు చెప్పి కొన్నాళ్లుగా శారీరక సంబంధం ఏర్పరుచుకున్నాడు. వారం రోజుల కిందట అనారోగ్యంతో దవాఖానకు వెళ్లగా యువతి గర్భం దాల్చినట్లు తెలియడంతో శనివారం కుటుంబ సభ్యులు ఊట్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని, ఆదివారం బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం జిల్లా దవాఖానకు తరలించినట్లు ఎస్సై విలేకరులకు తెలిపారు.



పొన్నకల్ వాగులో పిల్లర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

## వంతెన పిల్లర్‌కు మరమ్మతులు

మూసాపేట(అడ్డాకుల), ఆగస్టు 25 : అడ్డాకుల మండలంలోని శాఖాపూర్, పొన్నకల్ శివారులోని పెద్దవాగుపై నిర్మించిన వంతెన పిల్లర్‌కు ఆదివారం మరమ్మతులు చేశారు. వాగుపై ఉన్న పాత వంతెన అంటే కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారికి నిర్మించిన పిల్లర్ మధ్యలో కోతకు గురై వాగులో వస్తున్న వరద నీరు పిల్లర్ కిందభాగం నుంచి దిగువకు వస్తుంది. ఆ విధంగానే కొనసాగితే పిల్లర్ కుంగిపోయి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నది. వంతెన కూడా కూలే ప్రమాదం లేకపోలేదు. అందుకు ఆదివారం ఎల్ అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ దీపామాడియా, సంతోష్, తేజస్‌స్వరూప్, ఐబీ డీఈ వెంకట రమేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చందర్‌నాయక్ పరిశీలించారు. వరద నీరు పిల్లర్ మధ్యలోకి రాకుండా ఇసుక సంచులు, మట్టితో అడ్డుకట్ట వేశారు. వరద నిల్వ ఉండకుండా కాల్వను తీశారు.

## ప్రాజెక్టులకు స్వల్ప వరద

గద్వాల, ఆగస్టు 25 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. రెండు మూడు రోజుల నుంచి వర్షాలు ప్రారంభం కావడంతో ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆదివారం జూరాలకు 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా దిగువకు 41,192 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 318.000 మీటర్లుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.611 టీఎంసీలుగా ఉన్నది. నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, జూరాల ఎడమ కాల్వకు 550, కుడికాల్వకు 485, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, విద్యుత్ ఉత్పత్తికి 39,000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### తుంగభద్ర డ్యాంకు..

అయిజ, ఆగస్టు 25 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. ఆదివారం ఇన్‌ఫ్లో 19,989 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 10,023 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 86.274 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1627.87 అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 12,233 క్యూసెక్కు లు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 11,400 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 633 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9.2అడుగుల మేరకు నీటిమట్టం ఉన్నది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 28,838 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్ ఫ్లో 28,838 క్యూసెక్కులు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటిమట్టం 1705 అడుగులకు గానూ ప్రస్తుతం 1704.72 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి గరిష్ఠ నీటి మట్టం 129.72 టీఎంసీలకు గా నూ ప్రస్తుతం 128.19 ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 28,480 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 34,199 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1615 అడుగులకుగానూ ప్రస్తుతం 1613.85 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 36.54 టీఎంసీలు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద